క్లుప్తంగా

హిటాచి, టిప్పర్ పట్టివేత



ఐనవోలు : ప్రభుత్వ భూమి నుంచి అక్రమంగా మొరం తవ్వుతూ టిప్పర్‌లోకి లోడ్ చేస్తున్న హిటాచి, టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల శివారులోని సబ్ స్టేషన్ సమీపంలో అక్రమంగా ప్రభుత్వ భూమి నుంచి మొరం తీసి డంప్ చేస్తున్నారన్నా సమాచారంతో మంగళవారం రెవెన్యూ అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో టిప్పర్, హిటాచితో పాటు సుమారు 50 టిప్పర్ల మొరాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాహన యజమానులు, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. దాడుల్లో ఆర్ఐ రాణి, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

సీఐ పరామర్శ

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన జర్నలిస్ట్ రంగు శ్రీధర్ తల్లి చెన్నమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న సీఐ రంజిత్‌రావు, ఎస్సై ప్రమోద్‌కుమార్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చెన్నమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పోచమ్మ ఆలయంలో బోనాలకు ఏర్పాట్లు

నర్సంపేట : పట్టణంలోని 10వ వార్డు పరిధిలోని పోచమ్మ ఆలయంలో శ్రావణ మాసం బోనాల పండుగ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయం పరిసరాలను స్థానిక కౌన్సిలర్ నాగిశెట్టి పద్మ ప్రసాద్ మంగళవారం మునిసిపల్ సిబ్బందితో శుభ్రం చేయించారు. ఆలయ పరిసరాల్లో డస్ట్‌తో కూడిన చిప్స్ పోయించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్న క్రమంలో బోనాలతో ఆలయానికి వచ్చే మహిళలకు ఇబ్బందులు తలెత్తే విషయమై మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. చి మునిసిపల్ సిబ్బందిచే ఆలయ పరిసరాలను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎదర బోయిన రామస్వామి, వలుస సత్యం, అరపల్లి బాబు, పస్తం ఎల్లస్వామి, పస్తం కృష్ణ, శ్రీరామోజు రాము, గ్యార శ్రీకాంత్, పస్తం హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

50 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి

సంగెం : ఉపాధ్యాయులకు 50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ ప్రకటించి పెండింగ్‌లో ఉన్న డీఏ విడుదల చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో ఆ యూనియన్ స్థానిక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. సుమారు 10 వేల పీఎస్ హెచ్‌ఎం పోస్టులు ప్రకటించి జీఓ నంబర్ 11, 12లను సవరించి బీఈడీ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని, సర్వీస్ రూల్స్‌తో జేఎల్, డీఎల్, డైట్ లెక్చరర్, ఎంఈఓ, డిప్యూటీ ఈఓ పోస్టులను అర్హులకు ఉద్యోగోన్నతి కల్పించి భర్తీ చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓల్డ్ పెన్షన్ వర్తింపజేయాలని, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మంగ రాజన్న, పి.రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

పర్వతగిరి : ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు గోవిందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ చెల్లింపులు, మెడికల్ బిల్లులు, పెన్షనరీ బెనిఫిట్లను ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిందని చెప్పారు. 2020 పీఆర్‌సీ గడువు ముగిసి ఏడాది గడచినా నూతన పీఆర్‌సీని అమలు చేయకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే నూతన పీఆర్‌సీ అమలు చేయడంతోపాటు మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు కుకింగ్ సీసీహెచ్ ఛార్జీలు చెల్లించాలనిఈ సందర్భంగా స్పష్టం చేశారు.

యువతలో దేశభక్తి నింపడమే లక్ష్యం

రాయపర్తి : యువతో దేశభక్తి నింపడమే లక్ష్యంగా బీజేవైఎం కార్యక్రమాలు చేపడుతోందని జిల్లా కార్యదర్శి రాపాక ప్రశాంత్ తెలిపారు. హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులతో మంగళవారం భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత చైతన్యవంతమైతే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ క్రమంలోనే యువతకు అవగాహన కల్పించే దిశగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు వడ్లకొండ రవి పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా అంతర్గత రోడ్లు

- తేలికపాటి వర్షానికే బురదమయం
- సైడ్‌కాల్వలు లేక రోడ్లపైనే మురుగునీరు
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ల్యాదెళ్లలో మట్టి రోడ్డుపై నిలిచిన నీటిలో నుంచి వెళ్తున్న బైక్

దామెర : పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు అడుగుతీసి అడుగువేయలేని దుస్థితి నెలకొంది. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలవడంతో కుంటాలను తలపిస్తున్నాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మురుగునీటిలోనే నడుస్తూ..

మండల కేంద్రంలోని మీసేవ సెంటర్‌కు రోజుకు పదుల సంఖ్యలో దరఖాస్తుదారులు వెళ్తుంటారు. ప్రధానరహదారి నుంచి మీసేవకు వెళ్లే దారిలో వర్షపునీరు నిల్వ ఉండటంతో అందులో నుంచే నడిచి వెళ్తున్నామని వివిధ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. బస్టాండ్ నుంచి గ్రామంలోకి వెళ్లేదారిలో మురుగునీరు రోడ్లపై పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని ఆగ్రహిస్తున్నారు. అలాగే ల్యాదెళ్ల గ్రామంలో గల రోడ్లపై వర్షం నీరు నిల్వడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ రోడ్లపై నాట్లు వేసి నిరసన తెలిపినా అధికారులు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పులుకుర్తి, కోగిల్వాయి, ఊరుగొండ, ముస్త్యాలపల్లి, పసరగొండ గ్రామాల్లో సైతం అంతర్గత రహదారులపై వర్షం నీరు, మురుగునీరు నిలుస్తోందన్నారు.

విజృంభిస్తున్న ఈగలు, దోమలు

గ్రామాల్లో రోడ్లపై నీరు నిల్వడంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం వేసిన సీసీరోడ్లు ధ్వంసమై గుంతలు ఏర్పడి, రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సైడ్ కాల్వలు లేకపోవడంతో ఇబ్బందులు

గ్రామాల్లో సీసీరోడ్లు ఏర్పాటు చేసి సైడ్ డ్రెయినేజీ కాల్వలు నిర్మించకపోవడంతో రోడ్లపై నీరు ప్రవహిస్తోందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గృహాల నుంచి వచ్చే మురుగునీరు రోడ్లపైనే నిలుస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోందని, ముక్కు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నామంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సైడ్ కాల్వలు నిర్మించాలని, ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరిస్తున్నారు.



ధ్వంసమైన రోడ్డుపై నిలిచిన నీరు

సీసీరోడ్లు నిర్మించాలి

గ్రామంలోని యాదవ కాలనీతో పాటు పలు వీధుల్లో మట్టి రోడ్లపై నీరు నిలుస్తోంది. దీంతో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా స్పందించి సీసీరోడ్లు నిర్మించి సమస్యను పరిష్కరించాలి. చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తోంది. అధికారులు పట్టించుకోవాలి.

– పిట్టల రమేశ్, ల్యాదెళ్ల

ప్రణాళికలు సిద్ధం చేస్తాం

మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో గతంలో వేసిన రోడ్లు ధ్వంసమయ్యాయి. వీటి మరమ్మతులకు ప్రణాళికలు సిద్ధం చేస్తాం. త్వరలో సమస్యను పరిష్కరిస్తాం. గృహాల నుంచి వచ్చే నీటిని గుర్తించి సదరు ఇంటి యజమానులు ఇంకుడు గుంతలు తవ్వుకునేలా చర్యలు తీసుకుంటాం.

– మనోహర్, దామెర స్పెషల్ ఆఫీసర్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- జిల్లా సైక్రియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్



మాట్లాడుతున్న డాక్టర్ ప్రహసిత్

శాయంపేట : విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా సైక్రియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావడంతో దాన్ని అధిగమించేందుకు మత్తు పదార్థాలకు బానిసవుతున్నారని అన్నారు. కానీ మత్తుతో జీవితం నాశనం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయికృష్ణ, హెచ్ఈఓ వెంకటేశ్వరవర్మ, అధ్యాపకులు సుహాసిని, హిమబిందు, శైలేందర్, వేణు, సునీల్‌కుమార్, కల్పన, విద్యార్థులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి



నడికూడ : అవగాహన కల్పిస్తున్న వైద్యులు



శాయంపేట : స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

నడికూడ : ప్రతిఒక్కరూ కేన్సర్‌పై అవగాహన కల్గి ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ స్వాతి సూచించారు. సామాజిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్యారోగ్య శాఖ, ఇండియన్ కేన్సర్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నోటి, గర్భాశయ, ముఖద్వారం, రొమ్ము, గొంతు తదితర భాగాల్లో కేన్సర్ రావచ్చని అన్నారు. కేన్సర్‌కు చికిత్స కూడా ఉందని, అధునాతన టెక్నాలజీ అందుబాటు ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు స్వాతి, అనూహ్య, వంశి, మాధవి, జ్యోతి, అపర్ణ, ఏఎన్ఎంలు, ఆశవర్కర్‌లు పాల్గొన్నారు.

కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులు

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసినట్లు వైద్యాధికారి సాయికృష్ణ తెలిపారు. సుమారు 93 మందిని పరీక్షించగా 62 మంది మహిళలకు నోటి, రొమ్ము, గర్భాశయ కేన్సర్ ఉన్నట్లు గుర్తించి పైఆస్పత్రులకు పంపించినట్లు తెలిపారు. ముఖద్వారా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా 9 మందికి రొమ్ము, గర్భకోశ కేన్సర్ అనుమానితులుగా గుర్తించి పైఆసుపత్రులకు రెఫర్ చేసినట్లు పేర్కొన్నారు. 31మంది పురుషులకు నోటి కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించగా ఐదుగురిని అనుమానితులుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ డాక్టర్లు, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా తయారు చేసి ప్రాణాలు తీయొద్దు

- ఎస్సైలు ప్రమోద్‌కుమార్, అశోక్



పట్టుకున్న నాటుసారా

శాయంపేట : ఒక వ్యక్తి సంపాదించేందుకు గుడుంబా తయారీ చేసి ఇతర వ్యక్తుల ప్రాణాలు తీయొద్దని శాయంపేట ఎస్సై ప్రమోద్‌కుమార్, దామెర ఎస్సై అశోక్ సూచించారు. మంగళవారం శాయంపేట మండలం సూర్యానాయక్‌తండాలోని గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 25 లీటర్ల నాటుసారా లభించినటట్లు తెలిపారు. ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సూర్యానాయక్ తండా గ్రామంలో గుడుంబా తయారీ, విక్రయాలు జరుగుతున్నాయనే పక్కా సమాచారంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ల్యావుడ్యా రోజా ఇంట్లో 10లీటర్ల నాటుసారా, ల్యావుడ్యా మానస ఇంట్లో 5లీటర్లు, జరుపుల లచ్చు ఇంట్లో 5లీటర్లు, బానోతు శోభన్ ఇంట్లో 5 లీటర్ల నాటుసారా లభించినట్లు తెలిపారు. గుడుంబాను స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. శాయంపేట, దామెర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కమలాపూర్ : ఈటల నిషాంత్ మెమోరియల్, కమలాపూర్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీహాల్‌లో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిషాంత్ మెమోరియల్, కేఈసీటీ చైర్మన్ డాక్టర్ ఈటల సమ్మన్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరంలో రెడ్‌క్రాస్ సొసైటీ హనుమకొండ, స్వస్తవ కేన్సర్ కేర్ డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. వివరాలకు 9014565006 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విధుల్లో చేరిన సర్వేయర్

దామెర : మండల సర్వేయర్‌గా స్టాలిన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కొంత కాలంగా ఇక్కడ పనిచేసిన కవితారాణి వేలేరు మండల సర్వేయర్‌గా బదిలీపై వెళ్లారు. కాగా ఆమె స్థానంలో శాయంపేటలో పనిచేసిన స్టాలిన్‌ను దామెర మండలానికి బదిలీ చేశారు.

క్రీడాకారులకు టీషర్ట్స్ పంపిణీ



శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేసి ఇటీవల బదిలీ అయిన కరిత క్రీడాకారులకు టీషర్ట్స్ పంపిణీ చేశారు. కరిత తల్లి రాణిసంయుక్త అనారోగ్యంతో మృతిచెందగా ఆమె జ్ఞాపకార్థం పీఈటీ కరిత మంగళవారం క్రీడాకారులకు టీషర్ట్స్, షాట్స్ పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులు ఉన్నారు. అనంతరం పీఈటీ కరిత ఇటీవల బదిలీ అయిన సందర్భంగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులు పూలమాల అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఎల్కతుర్తి : ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అధికారులతో కలిసి మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరు, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లోని రైతు వేదికలో ఈ చెక్కుల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జగత్‌సింగ్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, నాయకులు గోలి రాజేశ్వర్‌రావు, కడారి సురేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పూసాల వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పూసాల ప్రకాశం మంగళవారం దుస్తులు, స్కూల్‌బ్యాగ్స్, నోట్‌బుక్స్, గైడ్స్, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రకాశం మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది ఫౌండేషన్ తరపున 15 మంది పేద విద్యార్థులకు అన్ని రకాల స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కాగా ఈ ఏడాది దాతలు తోట సాయికిరణ్, గూడూరి లక్ష్మీనారాయణ, రావుల రమేశ్, జక్కుల సదయ్య, గూడూరి శ్రీనివాస్ సహకారంతో 30 మంది పేద విద్యార్థులకు రూ.50 వేల విలువ గల స్టడీ మెటీరియల్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న అధ్యక్షురాలు స్పందన

దామెర: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించి సమాజంలో నిలదొక్కుకోవాలని స్వర్ణతెలంగాణ మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్పందన అన్నారు. మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ఆమె అధ్యక్షతన వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో సమాఖ్య ద్వారా నిర్వహించిన లావాదేవీలను చదివి వినిపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ సంవత్సరం స్కూల్ యూనిఫాం తయారీని మహిళా సంఘాలకు అప్పగించగా సకాలంలో పూర్తిచేసి ఆర్థికంగా లబ్ధిపొందినట్లు తెలిపారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా 14 రకాల కార్యక్రమాలను స్వయం సహాయక సంఘాల సభ్యులకు అదించినట్లు తెలిపారు. మహిళా సంఘాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, వాటిని మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో ఏపీఎం డాక్టర్ ఝాన్సీ, సీసీలు మాధవి, నగేశ్, అకౌంటెంట్ సుకినె రాజేశ్వరీ, వీఓ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



సమస్యలను తెలుసుకుంటున్న మంద సురేశ్

శాయంపేట : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద సురేశ్ కోరారు. మంగళవారం ఆయన పాఠశాలలోని పరిసరాలను పరిశీలించారు. మంగపేట గురుకుల పాఠశాల విద్యార్థులు కూడా ఇక్కడే చదువుకోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. మిగిలిన అన్నం, కూరగాయల వ్యర్థాలు భోజనశాల వెనకాల వేయడం వలన దుర్వాసన వెదజల్లుతోందని అన్నారు. తాగునీరు ఫిల్టర్ కాకపోవడంతో విద్యార్థులు జనరల్ వాటర్ తాగుతున్నారని అన్నారు. శాయంపేట, మంగపేట పాఠశాలల విద్యార్థులు ఒకే దగ్గర ఉండడంతో డార్మెంటరీ, తరగతి గదులు సరిపోవడం లేదని వెంటనే ఆర్‌సీఓ స్పందించి మంగపేట ఎంజేపీ పాఠశాల విద్యార్థులను మరోచోటికి తరలించాలని డిమాండ్ చేశారు. ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్‌కల్యాణ్, నాయకులు వంశీ, సూర్య, మనోజ్, రింకు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



మొక్క నాటుతున్న సురేశ్

శాయంపేట : మండల కేంద్రంలోని మచ్చర్లయ్య గుట్టపై వెలసిన మత్స్యగిరిస్వామి ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే సత్యనారాయణరావు నిధులు మంజూరు చేయాలని బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు గిద్దమారి సురేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం హనుమాన్ స్వాములతో కలిసి మచ్చర్లయ్య గుట్టపై హనుమాన్, వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ.. మే నెలలో జరిగిన మత్స్యగిరిస్వామి తిరుకల్యాణోత్సవాల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని గుట్టపైఉన్న ఆలయ అభివృద్ధికి పది లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. కానీ చేతిపంపు ఏర్పాటు చేసి వదిలివేశారని, ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి వెంటనే నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులను చేపట్టాలని కోరారు. అనంతరం ఆలయ ప్రాగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో భక్తులు మోరే రంజిత్, ఎలగందుల ఉపేందర్, తట్ల రాజశేఖర్, ఉప్పు రాజు, అరవింద్, చందుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగాను జయప్రదం చేయాలి

- బైక్ ర్యాలీ నిర్వహించిన బీజేపీ నాయకులు



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో బీజేపీ నాయకులు మంగళవారం జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 15వ తేదీన ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. అంతకు ముందు బస్టాండ్ కూడలిలో సామూహిక జనగణమన (జాతీయగీతం) ఆలపించారు. మహనీయుల విగ్రహాలను శుద్ధి చేసి పూలమాల వేశారు. ఈ సందర్భంగా పలురువు నాయకులు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సత్యనారాయణరావు, శ్రీనివాస్‌రావు, నాయకులు శ్రీవర్ధన్, కిష్టయ్య, వెంకటేశ్, మధు, వెంకటేశ్, శ్రీకాంత్, లచ్చిరెడ్డి, దేవరాజ్, అశోక్, తిరుపతి, రాజు, అరవింద్, అనిల్ పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

వేలేరు : క్రీడలతోనే మానసికోల్లాసం లభిస్తుందని యువజన నాయకుడు పైండ్ల శ్రావణ్ కుమార్ అన్నారు. మండలంలోని పీచర గ్రామంలో స్థానిక హై స్కూల్ విద్యార్థులకు తన తండ్రి పైండ్ల సంపత్ రెడ్డి జ్ఞాపకార్థం స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం క్రీడల నిర్వహణ, బహుమతులకు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల వలన శారీరక దారుఢ్యంతో పాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని అన్నారు. క్రీడల్లోనే పోటీతత్వం ప్రదర్శించాలని అనంతరం స్నేహంగా ఉండాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు, యువకులు పాల్గొన్నారు.

'దౌర్జన్యం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి'



చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్ శివారులోని పనికర గుట్ట సమీపంలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న వారిపై దౌర్జన్యం చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్న నవీన్‌రెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ కోరారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవీన్‌రెడ్డి తప్పుడు పత్రాలతో ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడని తెలిపారు. గుడిసెవాసులను అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తూ దౌర్జన్యం చేశాడని చెప్పారు. నవీన్‌రెడ్డిపై గత నెల 30న పోలీసులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి నవీన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవడంతోపాటు పేదలకు భూమిని పంచాలని కోరారు.

ఉపాధ్యాయురాలి ఔదార్యం



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాజేశ్వర్‌రావుపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సోమంచి ఉమాదేవి విద్యార్థులకు టై, బెల్టులు, స్కూల్‌కు ఎలక్ట్రిక్ బెల్ అందించి ఔదార్యం చాటుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థుల ఉన్నతి దిశగా అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఈదుల వీరస్వామి, ఏపీసీ చైర్‌పర్సన్ బొజ్జ రాజక్క, పంచాయతీ సెక్రెటరీ రజియాతో పాటు తదితరులు పాల్గొన్నారు.